క్లుప్తంగా

నేడు ఏపీఎండీసీ ఉచిత వైద్య శిబిరం

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ ఆరోగ్యకేంద్రంలో నేడు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిచనున్నట్లు ఆద్య మెడికల్ సర్వీసెస్ మేనేజర్ అశోక్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో ఎముకలు, జ్వరం తదితర వ్యాధులకు సంబంధించి తిరుపతి సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు చెందిన వైద్యులచే సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తామని ప్రిన్సిపల్ కె.వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్‌లో 6 ఎలక్ట్రానిక్స్ 24 ఖాళీలు ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతోపాటు రూ.4,700 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి

రాయచోటి అర్బన్ : ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఎంతో లాభదాయకమైన ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపియస్)ను మాత్రమే అమలు చేయాలని బీటీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద బీటీపీ సభ్యులు ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన జీపీఎస్ ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. ఎట్టి పరిస్థితులలోనూ జీపీఎస్‌ను అంగీకరించే ప్రసక్తేలేదన్నారు. కార్యక్రమంలో బీటీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.వి.రమణ, ట్రెజరర్ గోపాల్‌దాస్ రాజశేఖర్, నేతలు రెడ్డెయ్య, చంద్రాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పండిత పరిషత్తుకు నూతన కార్యవర్గం

రాయచోటి అర్బన్ : రాష్ట్రీయ పండిత పరిషత్తు అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానికంగా జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎంపికకు రాష్ట్రీయ పండిత పరిషత్తు అధ్యక్షుడు కె.రమణయ్య, రాష్ట బాధ్యుడు గంగనపల్లె వెంకటరమణలు పరిశీలకులు వ్యవహరించారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా టి.క్రిష్టారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మైనుద్దీన్, గౌరవాధ్యక్షుడిగా కె.రామచంద్రారెడ్డి, కోశాధికారిగా గంగాధర్ రెడ్డిలు ఎన్నికయ్యారు. సహాధ్యక్షులుగా శివశంకరయ్య, రామ్మోహన్, సుధాకరరాజు, అదనపు ప్రధాన కార్యదర్శులుగా నరేంద్ర, సుబ్బరామరాజు, భాస్కరయ్య, ఉపాధ్యక్షులుగా మాబు హుస్సేన్, డి.శివశంకరయ్య, బి.నరసింహులు, మహిళా కార్యదర్శులుగా శృతి, సుభాషిణిలు, కార్యదర్శులుగా వెంకటరమణారెడ్డి, ఎం.శంకర్ నాయక్, ఓబులరెడ్డిలను ఎన్నుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గాలివీడు : మండలంలోని అరవీడు గ్రామం గుట్ట చివర ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న ముందస్తు సమాచారంతో గురువారం ఎస్ఐ వెంకటశివప్రసాద్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఐదుగురు పేకాట రాయుళ్లను, రూ. 3500లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటు

రాజంపేట రూరల్ : వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటని జిల్లా మాజీ ఉత్తమ రైతు అవార్డు గ్రహీత ఆకేపాటి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని హస్తవరం గ్రామంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ స్వామినాథన్‌తో ఉన్న జ్ఞాపకాలను పంచుకున్నారు. 2007వ సంవత్సరంలో స్వామినాథన్ చేతులమీదుగా తాను జిల్లా ఉత్తమ రైతు అవార్డును అందుకున్నానన్నారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు స్వామినాథన్ నాంది పలికారని కొనియాడారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం స్వామినాథన్ ఎనలేని కృషి చేశారన్నారు. వ్యవసాయ రంగంలో ఆయన చేసిన సేవలకు గాను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు అవార్డులతో సత్కరించారని పేర్కొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

గాలివీడు : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వెంకటశివకుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రాయచోటి – కదిరి ప్రధాన రహదారిపై హెల్మెట్ ధరించడంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ప్రమాదాలు నివారించుకోవాలంటే హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలు తగలకుండా ఉండేందుకు హెల్మెట్ ఎంతో సహాయపడుతుందని, తద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడేందుకు అవకాశాలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అంజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రవక్త నిర్దేశించిన మార్గంలో నడవాలి

- శాంతి ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు
- అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు



ఒంటిమిట్ట: మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్ బాషా

ఒంటిమిట్ట : మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని జరుపుకునే మిలాద్ ఉన్ నబీ నాడు మసీద్‌ను ప్రారంభించడం శుభపరిణామం అని ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ వ్యవహారాల మంత్రి అంజద్ బాషా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెండామాను వీధిలో ఇదివరకు ఉన్న పురాతనమైన మసీదును తొలగించి దాని స్థానంలో ప్రస్తుత కాలానికి అనుగునంగా నిర్మించిన జామియా మసీదును అంజద్ బాషా ప్రారంభించారు. ముందుగా డిప్యూటీ సీఎంను మసీదు ముతవల్లి షేక్ హబీబుల్లా, జామియా మసీదు కమిటీ సభ్యులు డీలర్ మస్తాన్, డాక్టర్ జిలాని బాషా, షేక్ అజ్మతుల్లా కలిసి ఆయనకు పుష్పగుచ్చం ఇచ్చి ఆహ్వానం పలికారు. అలాగే మసీదు లోపల జరుగుతున్న భయాన్‌ను విన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పునర్నిర్మాణం చేసిన మసీదు చాలా బాగుందన్నారు. ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు దైవ ప్రార్థన చేసుకుంటూ శాంతియుతంగా, ప్రశాంతంగా జీవించాలన్నారు. మసీదు నిర్మాణానికి సహకరించిన దాతలకు ఆ అల్లా దయ ఎల్లవేళలా వారిపై ఉండాలని ఆకాంక్షించారు. అలాగే మసీదు నిర్వహకులు అందజేసిన తేనేటి విందును స్వీకరించారు. మత గురువులు అబ్దుల్ రెహమాన్ బోగ్దాది, మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో జామియా ఇస్లామిక్ నూరుల్లా ట్రస్ట్ మదర్సా నిర్వాహకులు క్వారీ అబ్దుల్ సుబహాన్, మౌలానాలు షహేన్షా జకావుద్దీన్, నిజాముద్దీన్ బుకారి, అబ్దుల్ హైదర్ అలీ, మౌలానా మహబూబ్ బాషా జామియా మసీదు కమిటీ సభ్యులు షేక్ అమానుల్లా, మహమ్మద్ రఫీ, సయ్యద్ జాకీర్ హుస్సేన్, సత్తార్, తాజుద్దీన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

పెనగలూరు : మండలంలో గురువారం ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ వేడుకలను అత్యంత పవిత్రంగా నిర్వహించుకున్నారు. చక్రంపేటలో ఈ వేడుకలను ముస్లిం సోదరులు జామియా మసీదు, ఇస్లాం మహమ్మద్ రెహమాన్ ఆధ్వర్యంలో దర్గా నుంచి గంధం మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. అలాగే పెనగలూరు, నాయుడువారిపల్లి, ఓబులి గ్రామాలలోనూ ఈ వేడుకలను ముస్లిం సోదర సోదరీమణులు జరుపుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకలలో ప్రవాసాంధ్ర ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు.

నందలూరులో శాంతి ర్యాలీ

నందలూరు (రాజంపేట) : మహమ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గంలో నడవాలని గురువులయ్య హైదర్ సాహెబ్ అన్నారు. గురువారం మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా నందలూరు పంచాయతీలోని మసీదు నుంచి రైల్వే ఆవరణలో వెలసిన హజరత్ ఖాదర్ వలి దర్గా వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హైదర్ సాహెబ్ మాట్లాడుతూ ప్రపంచ శాంతికోసం మానవాళికి విలువైన సందేశాలు ఇచ్చిన మహోన్నత వ్యక్తి మహమ్మద్ ప్రవక్త అని అన్నారు. అల్లాహ్ దీవెనలు మనందరికీ ఉండి అందరికీ మంచి జరగాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. అనంతరం మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పేదలకు అన్నదానం

మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా నందలూరు రైల్వేకాలనీలో వెలసిన హజరత్ ఖాదర్ వలీ దర్గా వద్ద జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యులు కలీం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్ఐ అబ్దుల్ జహీర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్ఐను సర్పంచ్ జంబు సూర్యనారాయణ, దర్గా కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు కమాల్ బాషా, వైస్ ప్రెసిడెంటు షమీవుల్లా ఖాన్, సెక్రటరీ ఖాదర్ వలి, సయ్యద్ జుల్ఫికర్, హిమగిరినాథ్ యాదవ్, ఏఎస్ఐ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పెనగలూరు: చక్రంపేటలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



నందలూరులో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు



అన్నదానం ప్రారంభిస్తున్న ఎస్ఐ అబ్దుల్ జహీర్

జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు



విద్యార్థులతో ఫిజికల్ డైరెక్టర్ ప్రమీల

చిట్వేలి : ఓబులవారిపల్లి మండలం బొమ్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన నియోజకవర్గస్థాయి పోటీలలో నాగవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ ప్రమీల గురువారం తెలియజేశారు. అండర్–17 బాలుర విభాగంలో లాంగ్ జంప్, హై జంప్‌లలో హేమంత్ మొదటి బహుమతి సాధించగా 800 మీటర్ల పరుగు పందెంలో హర్షిత రెండోస్థానం సాధించి జిల్లాస్థాయికి ఎంపికయ్యారన్నారు. జిల్లాస్థాయికి ఎంపిక కావడంపట్ల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వేలంలో రూ.1.5 లక్షలు పలికిన గణేశ్ లడ్డూ



వేలంలో దక్కించుకున్న లడ్డూతో నరేంద్ర ఆచారి

రాయచోటి టౌన్ : పట్టణంలోని ప్రకాష్ నగర్ కాలనీలో నిర్వహించిన వినాయకుడి లడ్డూ వేలంలో రూ.1.5లక్షలకు నరేంద్ర ఆచారి దక్కించుకున్నాడు. ప్రకాష్ నగర్‌లో వినాయక చవితి సందర్భంగా వినాయకుడిని ప్రతిమను ఏర్పాటు చేశారు. అక్కడ యువకులు ఒక కమిటీగా ఏర్పడి 11 రోజులు ఉత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. చివరి రోజైన శుక్రవారం నిమజ్జనం నిర్వహించే క్రమంలో స్వామి వారికి సమర్పించే లడ్డూను వేలం నిర్వహించారు. దీని ద్వారా వచ్చిన డబ్బును స్వామి వారి ఉత్సవాలు నిర్వహణకు ఉపయోగిస్తారు. స్థానికంగా ఉండే యువకులు పోటాపోటీగా వేలంలో పాల్గొనగా నరేంద్ర ఆచారి రూ.1.5లక్షలకు దక్కించుకున్నారు. లడ్డూను దక్కించుకున్న భక్తుడి ఇంటి వరకు ఉత్సవ కమిటీ సభ్యులు మేళతాళాలతో ఊరేగింపు జరిపారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై ముమ్మర ప్రచారం



పెనగలూరు: అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి



రామాపురం: కరపత్రాలను అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రామాపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు శ్రీరామ రక్షగా నిలుస్తుందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మక్కోటి బసిరెడ్డి, కుమ్మరపల్లె సర్పంచ్ భారతీలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కుమ్మరపల్లె పంచాయతీలోని బసిరెడ్డిగారిపల్లెలో ఆరోగ్య సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలోని ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలు పొందాలని తెలియజేశారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు సలహాలు, సూచనలు అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరంలో అందించే సేవలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కుమ్మరపల్లె వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

పెనగలూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. గురువారం పెనగలూరు పంచాయతీలోని సాతుపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పథకాలను ప్రవేశపెట్టారని, ప్రజల క్షేమం కోసం ఎల్లవేళలా తపించే మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. మండలంలో ప్రతి ఒక్కరూ ఈ ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఆయన అన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మారుమూల గ్రామాల ప్రజలకు ఈ పథకంపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఈ జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతి ఇంటికి ముందుగా సర్వే చేసి ఎవరు బాధితులు ఉన్నారో వారి డేటా సేకరించి వారి ఇంటికి వెళ్లి వైద్యం చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డివారి సుబ్బారెడ్డి, పున్నాటి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ

రాయచోటి అర్బన్ : పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్లను ఉపసంచాలకులు జాకీర్‌హుస్సేన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహం, బాలుర వసతి గృహం నం.1లను పరిశీలించారు. విద్యార్థుల దినచర్యలను పరిశీలించి వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. క్రమశిక్షణతో విద్యపై అభ్యసించాలంటూ సూచించారు.



బయోమెట్రిక్‌ను పరిశీలిస్తున్న అధికారి జాకీర్ హుస్సేన్

రాకపోకలకు ఇబ్బందులు ఉండకూడదు



పండ్లమండీలు, అలీమాబాద్ వీధులకు వెళ్లే దారిని పరిశీలిస్తున్న చైర్మన్, అధికారులు

రాయచోటి అర్బన్ : రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణం వలన ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలంటూ అధికారులకు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా ఆదేశించారు. పట్టణంలోని ఠాణా నుంచి సుండుపల్లె రోడ్డులోని రింగురోడ్డు వరకు రోడ్డు వెడల్పు, మురుగునీటి కాలువల నిర్మాణంతో తాము ఇబ్బందులు పడుతున్నట్లు పట్టణ వాసులు మున్సిపల్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఫయాజ్ బాషా మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఏఈ వెంకటక్రిష్ణారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేత సయ్యద్ షబ్బీర్ తదితరులతో కలసి రోడ్డు, కాలువ నిర్మాణాలను పరిశీలించారు. ముఖ్యంగా సుండుపల్లె రోడ్డు నుంచి పండ్ల మండీల మీదుగా అలీమాబాద్ వీధిలోకి వెళ్లేందుకు కాలువ నిర్మాణం జరుపకపోవడంతో వాహనాల రాకపోకలు జరుగక జనం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సాయంత్రంలోపు ఆమార్గంలో రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకోవాలంటూ అధికారులను చైర్మన్ ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందిలు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సహాయం

రాయచోటి అర్బన్ : పేదరికం కారణంగా వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని కుటుంబానికి ఆజాద్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు గురువారం ఆర్థిక సహాయం అందించారు. పట్టణంలోని కొత్తపల్లె పాంతంలోని నూరాని మసీదు దగ్గర నివసిస్తున్న హసీనాబానుకు షుగర్ అధికం కావడంతో వైద్యులు ఆపరేషన్ చేయించుకోవాలంటూ సూచించారు. ఆర్థికస్థోమత లేక వారు సొసైటీని ఆశ్రయించగా హసీనాభాను కుటుంబీకులకు రూ.5వేలను అందించారు. కార్యక్రమంలో షాహుల్ హమీద్, మౌలానా ఇందాదుల్లా ఖాన్ ఖాస్మి, మహమ్మద్‌అలీ, సిబాతుర్ రహిమాన్, ముహీబుల్లా, మహమ్మద్ ఇలియాస్ పాల్గొన్నారు.

అంటరానితనం నిర్మూలనకు 'జాషువా' కృషి



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : సమాజంలో వేళ్లూనుకుపోయిన అంటరానితనం నిర్మూలనకు గుర్రం జాషువ తన కవితలతో ఎండగట్టి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని తెలుగుభాషా సంరక్షణ సమితి జిల్లా సహాయక కార్యదర్శి గంగనపల్లె వెంకటరమణ తెలిపారు. స్థానిక సరస్వతీ విద్యా మందిరం పాఠశాలలో గురువారం తెలుగుభాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గంగనపల్లె మాట్లాడుతూ గౌరవం అన్నది కులానికా, గుణానికా అన్న రోజుల్లో పుట్టి పెరిగిన జాషువా దారిద్ర్యాన్ని అనుభవిస్తూ కుల, మత బేధాలను తన రచనల ద్వారా నిరసిస్తూ విశ్వమానవుడిగా ఎదిగారని కొనియాడారు. తన జీవితంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న జాషువా మానవీయ దృక్పథంతో రచనలు చేసి మహాకవిగా పేరుగాంచాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలుగుభాషా సంరక్షణ సమితి ప్రతినిధులు బీవీ నారాయణరాజు, యూపీ రాయుడు, గుంటూరు రామయ్య, సుబ్రమణ్యం, దయాకర్, ఉష, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐవైఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ అన్నారు. గురువారం పట్టణంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 116వ జయంతి వేడుకలను నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన భగత్‌సింగ్ యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. యువతను ఉత్తేజ పరిచి వారిని స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామ్యులను చేయడంలో భగత్‌సింగ్ పాత్ర కీలకమైందన్నారు.

రక్తదానం

కడప ఎడ్యుకేషన్: అన్ని దానాలకన్నా రక్తదానం మిన్న అని లయన్ పటాన్ ఖాదర్‌బాషా అన్నారు. గురువారం కడప గుంతబజార్ సున్ని మసీద్‌లో విలాద్ జుసుస్ కమిటి, ఖూన్ క రిస్తా సంయుక్త ఆధ్వర్యంలో ఈద్–ఉల్ మిలీత్ పురస్కరించుకుని మోగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేద్దాం

లక్కిరెడ్డిపల్లె : భారతీయ జనతా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు రాష్ట పార్టీ, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సాయి లోకేష్ పిలుపు మేరకు గురువారం రాయచోటి నియోజకవర్గంలోని లక్కిరెడ్డిపల్లెలో బూత్ నెంబరు. 15 కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు కె.వెంకటరామరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల ఇన్‌చార్జి, బీజేపీ పార్టీ రాష్ట మేధావుల సంఘం సభ్యుడు డాక్టర్ పాలగిరి శ్రీనివాస కుమార్ రాజు పాల్గొన్నారు. ఈ సమావేశంలో శక్తి కేంద్రాలు పోలింగ్ బూత్ కమిటీలపై చర్చించినట్టు తెలిపారు. మండల కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జానం బాలాజీ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శులు సి.ఆంజనేయులు, ఒ.ప్రసాద్ యాదవ్, నాగముని, నారాయణ రెడ్డి, కె.కృష్ణ, రమణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం : బీజేపీని బూతు స్థాయి నుంచి బలోపేతం చేయాలని బీజేపీ నాయకులు తెలిపారు. గురువారం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ పిలుపు మేరకు మండలంలోని హసనాపురంలో మండల అధ్యక్షుడు చిర్రా విజయ్‌భాస్కర్ రెడ్డి అధ్యక్షతన పప్పిరెడ్డిగారిపల్లె పోలింగ్ బూతు కమిటీ సమావేశం నిర్వహించారు. మండల ఇన్‌చార్జ్‌గా శివ ప్రసాద్ పర్యటించారన్నారు. మండల బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు గురించి చర్చించినట్టు చెప్పారు. మండల కమిటీలను బలోపేతం చేసేలా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సురేష్, ఓబులేసు, శ్రీను, శివ, ఆంజనేయులు, గంగులయ్య, శ్రీనాథ్, విశ్వ, మహేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి పంచలోహ విగ్రహం వితరణ



మారమ్మను పురవీధులలో ఊరేగిస్తున్న దృశ్యం

పుల్లంపేట : మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో వెలసిన మారమ్మకు గురువారం పుల్లంపేట వైస్ ఎంపీపీ బోగా వెంకటరత్నమ్మ, భర్త బోగా వెంకటరామయ్య దంపతులు రూ. 1 లక్షలు విలువజేసే అమ్మవారి విగ్రహాన్ని ఆలయానికి అందించారు. అనంతరం పూజారి శివశర్మ ఆధ్వర్యంలో హోమం నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. బోగా పార్థసారథి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.